ఎక్సురే ౬౩

"విహారి"

# యమలోకం ౨

మేం నడుస్తూన్న రాజబాటకి యెడం వేపుగా దాదాపు నాలుగైదు మైళ్ళ దూరంలో వొహ పట్నం గోచరించింది. భవనాలన్నీ యెత్తులోనూ తగ్గులోనూ భేదాలున్నాయే కాని, నిర్మాణంలోనూ, ఆకారంలోనూ అన్నీ ఒకే పోళ్గా వున్నాయి అంత పట్నంవుందని పేరే కాని పట్నంలో కాని, దాని పరిసరాల్లో కాని పేరుకి వొక్క పచ్చని చెట్టయినాలేదు. అంతా బోడిగా కొత్తగా వైధవ్యం అనుభవిస్తూన్న వితంతువులా వుంది. ఆశ్చర్యం! వెంటవొస్తున్న జవానుగాణ్ణి ప్రశ్నించాను. వాడిలా అన్నాడు. "బాబూ అది శాశ్వతనరకం. ఎప్పటికీ నిష్కృతిలేని పాపాలుచేసిన వారిని నామకార్థంగా విచారణ జరిపిన తర్వాత, యిక్కడికి సాగనంపుతారు. దీని ఆవరణంలో ఒక్కసారి ప్రవేశించినవాడు తిరిగి బయట కాలుపెట్టడం చూచినవాడులేడు. దానిచుట్టూ నల్లగా కనపడుతూందే కోట. చూడ్డానికి అలావుందే కాని దాన్ని సమీపించడానికే వీల్లేదు. దాని సంగతి మనం అనుకోవడం కూడా అసహ్యం. మనకెందుకు వెళదాం పదండి" అని.

పేరు వినడంతోటే. అక్కడికెళ్లి రెండు పూటలు మకాంచేసి, సంగతి సందర్భాలు భోగట్టా చెయ్యాలని బుద్ధిపుట్టింది. "అలా కాదు నీవు నీ యిష్టంవచ్చినట్లా వెళ్లిపో. నేను మాత్రం ఆ శాశ్వత నరకాన్ని వెళ్లి చూడందే రాను" అనేశా. వాడు దానికి "అలా వీలు కాదండిబాబు. యమధర్మ రాజుగారి లిఖితపూర్వకమైన అనుజ్ఞలేందే వొహరేం, చివరకి యింద్రుడంతటివాడు కూడా వెళ్లడానికి అవకాశంలేదు. చట్టాలు అలా కఠినంగా వున్నాయి" అన్నాడు. "నారదమహాశయుల పరిచయ పత్రమూ, స్వర్గలోకం అంతా స్వేచ్ఛగా సంచరించడానికి అనుమతిస్తూ యివ్వబడ్డ సాధికార పత్రమూ నాదగ్గర వున్నాయి. పైగా శ్రీశ్రీ దేవేంద్రులవారికి, వారి గురువుగారైన బృహస్పతులవారికీ నాయందు యెంతో సద్భావంవుంది. అలాంటి నాకు దీంట్లోకి ప్రవేశం ఎందుకుండదు?" అన్నప్పుడు జవానుగాడు తలవూపి, నా మాటవిని నడవండి అంతగా కావలసివొస్తే తిరిగి సావకాశంగా వొద్దురుగాని" అని సమాధానపరిచాడు. వీడింతగా ఆటంకపరుస్తున్నాడు. మనం మాత్రం యెందు కంతగా పట్టుపట్టాలి? తర్వాత యెందుకు రాకూడదు? అని నాలో నేను సమాధానపడి నడిచాను.

మేం సంయమని పట్నంలోకి ఉదయం పది గంటలకి వెళ్ళాం. రాత్రి పూరికే పడుకోవడం మూలాన్ని, ఆకలి దహించుకొనిపోతూంది. అక్కడ యెవ్వరూ పరిచయం లేదు. బిఛానా ఎక్కడెయ్యాలి? యిహ యెటొచ్చీ పురోహితుడు వొహడూ. అనాధశరణాలయంలాగా. కాబట్టి మొదట్లో అక్కడికే వెళదామని అనుకున్నాను వీధుల్లో జనులు గుంపులు గుంపులుగా ఎక్కడికో వెళుతూండడం చూచాం. జవానుగాడు విచారించి కారణం తెలుసుకున్నాడు, ఆరోజు యమధర్మరాజు న్యాయస్థానంలో వొక కొత్త కేసు విచారణకు వొచ్చిందట. దాన్ని విని ఆనందించడానికై వెళుతున్నారట అందరూను, అసలు సంయమనిలో వుండేవాళ్లందరూ యమలోక రాజకీయ వాతావరణానికి చెందిన భటులూ నౌకర్లూ, సేవకులూ, వారి వారి కుటుంబాలూ. అంతే! ఇహ వారికి అహార నిద్రాదులు రెండు మూడు పనులుతప్ప మరి యితరం యేమీలేదు. సాధారణంగా బుద్ధి పుట్టినప్పుడూ, ముఖ్యంగా యేదైనా విశేషం వున్నప్పుడూ పొద్దు పోవడానికి న్యాయస్థానానికి వెళుతుంటారుట. ఈ సంగతి తర్వాత తెలిసింది. విచారణ సరిగా పదిన్నరకు ఆరంభం. నేను పురోహితుని యింటికి వెళ్ళితే మర్యాద ఆవశ్యం జరుగుతుంది. కాని ముక్కి—మూలిగి యే రెండు గంటలకో కాని రెండు మెదుకులు వెయ్యరు. ఈ ఆకలి మంటతో యీలోగా నేను న్యాయస్థానానికి వెళ్లితేమాత్రం. ప్రాణం యేమాత్రం ప్రశాంతంగావుండి అఘోరిస్తుంది? అంచాత తాత్కాలికంగా మూటా ముల్లా పడెయ్యడానికీ, కొద్దిగా మూతి తుడుచుకోవడానికీ వొక జాగా దొరుకుతే బాగుండు నని పించింది.

ఇలా ఆలోచిస్తూనే ముందుకి అడుగులు వేస్తున్నాను. ఉన్నట్లుండి అప్రయత్నంగా తలయెత్తి ముందువేపు చూచాను, ప్రాణం లేచివొచ్చింది. నట్టనడి యెడారిలో గంగా స్రవంతి దర్శనం యిచ్చింది, "మీ నాఖీ భోజన ఫలహారాల సత్రం" అని వొక పలక మీద రాసుంది. గాలి వ్యతిరేకంగా వీస్తున్నా, నా నాసా రంధ్రాల్లోనే పుల్లిపాయ సాంబారు వాసన ఉత్పన్నం అయింది. పుక్కిలించేంతగా నోటినిండా నీరూరింది. నోట మాట కూడా రాలేదు. రమ్మన్నట్టు జవానుగాడికి సైగచేశానోలేదో కూడా చెప్పలేను. పాదాలు సరాసరి సత్రంలో దూరాయి. మందిరంలో ఎదురుగా వొక గిటకపొరు మనిషి ప్రత్యక్షం అయ్యాడు. కటి ప్రదేశంచుట్టూ బొడ్డుకి చాలా కిందుగా వొక మలిన వసనం చుట్టుకొని, కింది అంచుల్ని మోకాళ్లదాటేవరకూ పైకెత్తి యెగదోపుకొని వున్నాడు. ఉదరం బాగా పెరిగివుంది. శరీరంమీద మగోబట్ట

లేదు. సగం నూసిన విభూతిరేఖలు ఆ నేరేడు పండులా మిల మిల మెరిసే శరీరంమీద శరత్కాలమేఘాల్లాగా ప్రకాశిస్తున్నాయి. తాంబూలరాగంతో నోరు వెలిగిపోతూంది. నన్ను చూచి కూచోమని కాబోలు యేదో భాషలో అన్నాడు.

పక్కగదిలో పది యిరవై మంది యమలోక పైనికోద్యోగులు కూచోని ఫలాహారాలు వేపుతున్నారు. కుర్రవాళ్లు సర్వుచేస్తున్నారు. నన్ను పలకరించిన వ్యక్తి నా యీ కొత్తరకం మొహాన్నిచూచో, మరే కారణం వల్లనో నాకు కొంచెం సమీపంగా బల్లమీద కూచోని పకిలిస్తూ. యాసగా తెలుగులోనే మీరు ఎక్కణ్ణుంచి వొస్తున్నారు అనే అర్థంలో ప్రశ్నించాడు. దీంతో యీన ఫలానా రకం అని తెలిసిపోయింది. ఆయనమాటకి సమాధానం యిస్తూ మీదేవూరు ? పేరేం ? యెలా యిక్కడికి వొచ్చారు. ఇక్కడ యీ వ్యాపారం సాగించడానికి అవకాశం యెలా కలిగింది ? అంటూ ప్రశ్నల వర్షం కురిపించాను. యిలా వొచ్చింది సమాధానం.

''నాపేరు పరమశివ. మా ఫాదర్ నా చిన్నతనంలోనే బెజవాడ—అంటే మీఆంధ్ర దేశంలోనే కాపురం వేశాడు. హోటల్ మహా బాగా జరుగుతూ వొచ్చింది. నేను ఫష్టుఫారం చదువుతూ వున్నప్పుడే వారు కాలంచేశారు. నేను చదువుమాని తండ్రిగారి వృత్తి అవలంబించాను. నా పలుకుబడీ ఆదాయమూచూచి మావేపు వాడే అక్కడికి పెద్ద యిన్‌స్పెక్టరుగా వొచ్చివుండి తన డాటర్ని నాకు యిచ్చి కళ్యాణంచేశాడు. మాకు యెనిమిది మంది కొడుకులూ ముగ్గురు బిడ్డలూను. బిడ్డల్ని మాంచి కట్నంయిచ్చి మా ప్రాంతంలోనే యిచ్చేశాను. కేఫ్ జోరుగా జరుగుతూ వుంది కాబట్టి కొడుకుల్ని బాగా చదివించాను. వాళ్ళందరూ వేరు వేరు శాఖల్లో ఆంధ్రదేశంలో వ్యాపించి యీనాడు మాంచి జీతాలు డ్రాచేస్తూవున్నారు. పై ఆదాయం కూడా బాగావుంది. సరిగా చిన్నవాడు బిదోఫారం చదివేరోజుల్లో నాకు టైఫాయిడ్ వొచ్చేసింది. వైద్యుడు నిమోనియా గబుల్ అంటూ చికిత్స ప్రారంభంచేశాడు పాపం వైద్యుడు యేం చేస్తాడు ? నా గింజలు అయిపోయాయి. ఇక్కడికో ఘట్టం అయిపోయింది.

ఆ రాత్రి తెల్లవారుజామున నా ప్రాణం శరీరాన్ని వొదుల్తుంది. యింట్లో అందరూ నిద్రపోతున్నారు. పక్కని హాల్లో నాడు ఎక్సెస్‌గా చేయబడి మిగిలిపోయిన ఫలహారాలు మూతలూ ముక్కలూ లేకుండా పడివున్నాయి. నేను మాత్రం బాధపడుతూ యేమేమో ఆలోచిస్తూ కుక్కిలోపడివున్నాను. వాకిళ్ళన్నీ బందోబస్తుగా మూసివున్నాయి. గాలికూడా సరిగా ఆడ్డంలేదు. ఉన్నట్టుండి యెవరో చప్పరిస్తున్న శబ్దం చెవులకి వినపడ్డది. నేను మెల్లిగా కళ్లుతెరిచి ఆవేపు చూచా. గుండె బద్దలయ్యేంత భయంవేసింది. వొక మొరటుమనిషి బల్లమీద కూచోని, వున్న ఫలాహారాలన్నీ దంచేస్తున్నాడు. మొదట్లో దొంగేమో అనుకున్నాను. అంత బందోబస్తుగా మూసివున్న యింట్లోకి దొంగ రావడం యెలా ? పైనా ఆతగాడి శరీరం స్పష్టంగా వుండక దట్టమైన ఛాయలావుంది. యింకా భయంవేసింది. అయితే మాత్రం నేను చేసేది యేముంది ? పెద్దగా అందడానికి గూడా శక్తిలేదు. నాలి చచ్చిపోయింది. చివరకి ఆ కారాన్ని నిదానించిచూస్తే అది నిజంగా దైవమాయ అనిపించింది. ఎందుకైనా మంచిదేనని తలచి, నేనుసమయస్ఫూర్తి కలవాణ్ణి కాబట్టి రెండు చేతులూ అఛాయ వేపు జోడించా. నవ్వడివిని ఆ వ్యక్తి నా వేపుమిలమిల్లాడే కళ్ళతో చూచాడు. మొహం కాస్త ప్రసన్నంగావుంది. గటగట చెంబెడు నీళ్లుతాగి, అతడు నా దగ్గిరికి నిశ్శబ్దంగా వొచ్చాడు. చేతులు అలా జోడించే నేను భయంతో రెండు కళ్ళూ మూసుకున్నా. ఆతగాడు నామీదికీ వొంగినట్టు తోచింది. ''నీ కాలం తీరింది. నీకోసమే వొచ్చాను. నీ విషయంలో తృప్తిపడ్డాను. లే !'' అన్న శబ్దం వినిపించింది. కళ్లు తెరిచా నా శరీరం నిర్జీవంగా మంచంమీద పడుంది. నేనో కొత్త మనిషిలాగా ఆ కొత్తవ్యక్తి చేతులోవుండి, శరీరంలేకుండానే నా చచ్చిన శరీరంవేపు చూస్తూవుండిపొయ్యా. ఆ శరీరమంటే నాకెంతో మమకారం. వొచ్చినవ్యక్తి నేనున్న తన చేతిని వెనిక్కి లాగపొయ్యాడు. నేను కదల్లా. అందుచేత అతడు నాతో శాంతంగా 'యేంకావాలి ?' అని అడిగాడు. నేను భోరు భోరున యేడుస్తూ నా శరీరం—నా శరీరం అన్నాను, దానికి అతడు ''నీకు యీ శరీరం యిహ దొరకదు. నీవు చేయించిన ఫలహారాలన్నీ బాగా తిన్నాను. నీమీద నాకు జాలి వేస్తూంది, నీకు నా చేతనైనంత వుపకారం చేస్తాను. నీ శరీరంమీద నీకంత మోజుగా వుంటే అలాంటి శరీరంలోనే నిన్ను ప్రవేశపెడతాను. అయితే నీవు నాకో మాట యివ్వాలి'' అన్నాడు. అదేమిటి ? అని అడిగానేను. దానికి ఆయన యిలా అన్నాడు. ''నీవు దివ్యమైన వంట చేయించావు. యిలాంటి తిండి నేను యేనాడూ ఎరగను. నేను సామాన్యమైన యమభటుణ్ణికాదు. పై అధికారిని. తమాషాగా వొచ్చినందుకు మంచి లాభం కలిగింది. లెక్క ప్రకారం నీవు దమ్మిడీ యెత్తు పుణ్యం చెయ్యలేదని నేను బాగా యెరుగుదును. అయినా నేను తృప్తిపడడమే నీ పుణ్య ఫలం. నేను అధికార్ని కాబట్టి తలుస్తే మా లోకంలో ఎంతేసి పనైనా చెయ్యగల. నీవు మా యింట్లో వంటవాడివిగా వుండిపో'' అన్నాడు. నాకు నిజానికి చాలా కష్టం అనిపించింది, బాబూ. దానికి నాకేమీ అభ్యంతరంలేదు కాని వొక్కమాట నా కొడుకులు గొప్ప గొప్ప వుద్యోగాల్లో వున్నారు. నేను వంటవాడుగావుండడం——నా మాట పూర్తికాలా. అందుకున్నాడు కఠినంగా. ''ఆ — వుద్యోగాల్లో వుంటే నీవు హోటలు మానుకున్నావా ? యీ మాటలు కట్టిపెట్టు. లేకుంటే నీ గతి వుండనేవుంది అంటూ గర్జించాడు. నేను చచ్చినట్టు అయిపొయ్యా.

ప్రయాణం సాగింది. నా యిల్లూ—నా శరీరం—నా సర్వస్వం వొదిలిపెట్టి చివరకి మసాలాపొగాకు పట్టికూడా తీసుకోకుండా యీ లోకానికి వొచ్చేశా. నన్ను తెచ్చినా యన యేమేంచేశాడో యిప్పటిగ్గూడా నాకు తెలుసుకోవాలా అనిలేదు. ఏదో మామూలుగా విచారణ జరిగింది. ఆ మర్రాజే వొక పెద్ద డిన్నరుపార్టీ జరిగింది. నన్ను ఇప్పుడు మీరు చూస్తూన్న నేను కోరిన నా శరీరం లాంటి దాంట్లోనే ప్రవేశపెట్టి వంట చెయ్యమన్నారునన్ను. పరికరాలు సమృద్ధి! వంట దివ్యంగాచేశా. రాత్రికి అందరూ స్విష్టకృతుగా భోంచేశారు. యమప్రభువుగారు కూడా నా వంట మెచ్చుకున్నారు. నా పాపాలు మసీ అయిపొయ్యాయి. కాని అక్కడి పై నౌకర్లలో కాస్తా రగడ జరిగింది. చివరకి నేను ఒకరి వంటవాణ్ణిగా వుండవలసిన పద్ధతి తప్పిపోయి, యిలా ఇండిపెండెంటుగా వుండిపొయ్యా. ఇప్పుడు అధికార్లూ అనధికార్లూ మన సత్రానికి వొచ్చిపోతుంటారు. ఒక్క ప్రభువుగారికీ, నన్ను యిక్కడికి తెచ్చిన బాబుగారికీ మాత్రం అన్ని పదార్థాలూ ఫ్రీ. కాని. మిగతా వారిదగ్గర రట కాయించి డబ్బు లాగేస్తున్నాను. ఆన్నీ బంగారు నాణాలే! అయితే వొక్క చిక్కొచ్చి పడ్డది, ధనం దాచుకోడానికి యిక్కడ బ్యాంకులూ గట్రాలేవు. మీరు యెలాగూ సశరీరంగా యిలా రావడం నా పుణ్యం. నా ధనమంతా మన లోకంలో దాచుకోవడానికి యేదైనా మార్గంవుంటే చూడండి. మాకడగొట్టు పిల్లాడి పెళ్లికి కాస్త డబ్బు కూడా పంపాలనివుంది. మీరు కేవలం మావారు. మీరు ఇక్కడ ఎన్నాళ్లున్నా లక్షణంగా భోంచెయ్యవొచ్చు. మీరు బుద్ధిపుట్టి బలవంతంచేసి యిస్తే తప్ప, నేను యేమీ పుచ్చుకోను. గోంగూర పచ్చడి కూడా స్పెషల్‌గా తయారు చేస్తాను" అన్నాడు.

నాకు తొందరగా వుంది. తర్వాత అన్ని సంగతులూ మాట్లాడవొచ్చునని చెప్పి. వొక ప్లేటు యిడ్లీ సాంబారూ, వొక పెసరట్టూ కొట్టి కాఫీ తాగేశా, జనానుగాడికి కూడా ఫలాహారం పెట్టించి, త్వరగా న్యాయస్థానం వేపు బయలుదేరాను.

---

7-వ పేజీ తరువాయి

## జుబేదా

"అయితే నన్ను మళ్ళీ పిలుస్తారన్నమాట"

'తప్పకుండా' అని నమస్తే అన్నా. ఆమెకూడా నమస్తే అని చేతులు జోడించి నామొహంవంక చూస్తూనే వెనక్కు వెళ్లింది. ఆమె అదృశ్యమైంది. ఏమో. ఆమె యింకా ఇక్కడవుందేమో.... రెవరీలావుంది—

రెండో అమ్మాయి పూనానుంచి వచ్చింది. బుద్‌వర్ పేట పూనానుంచి వచ్చిందని చెప్పింది. పల్చని జార్జెట్ చీరె ధరించింది. నడుంచుట్టూ చాలా బిగువుగా ధరించింది. ఆమె పల్చని శరీరం నాకు కనిపించేలా. ఎండిన వెదురు తీగెలావుంది. ఆమె వక్షస్థలం ఒక ఎడారి. పెదవులలో ఎరుపుతనంలేదు. ఆమెదృక్కులు శూన్యంగా వున్నాయి. ఆమెవచ్చి నాముందు కూర్చుంది. ఆమెవచ్చి నాతో యిలా చెప్పింది.

"నాకు తెలుసు మీరు వుద్యోగం యివ్వరని. నాలో స్త్రీత్వం లేదు. భావం శూన్యం. మధురమాసున్న. ఇన్నిమాట లెందుకు నాలో అన్నీ శూన్యం. అయినా ఉద్యోగంకోసం మిమ్మల్ని అడుక్కుంటున్నాను: జీవితంమీద విరక్తిపుట్టి ఇలా సిగ్గులేక అడిగిన వ్యక్తిని, ఈ స్త్రీని మీరు మెచ్చుకోరా?—మీరు తప్పకుండా....నేను పాడైన భవనంలోని రాయిని. మీరు నన్ను నిస్పృహచెందనీరని ఆశిస్తున్నా—"

'తప్పకుండా' అని నాలో అనుకొని పైకి

'నీపేరు' అన్నా

'కౌసల్య'

'ఎక్కడనుంచి వచ్చేవు?'

ఒక విజిటింగ్ కార్డ్‌తీసి నాచేతికిచ్చింది. అది నలిగిపోయి, మాలిపోయి, వుంది. అందులో యిలావుంది.

'కౌసల్య సినీ ఆర్టిస్టు. బుధవర్‌పేట. పూనా.'

అమెను పోల్చుకున్నా. ఆమె అమృతసర్‌నుంచి వచ్చిన పంజాబీయువతే అనే నిర్ణయానికి వచ్చాను.

"నువ్వు అమృతసర్‌నుంచి వచ్చావ్‌కదూ?"

'మీ కెలా తెలుసు,' వస్తున్న నవ్వు నాపుకుంటూ అంది.

'ఇంతకుముందు ఏ సినిమాలో Act చేశావ్'

'చాలా సినిమాల్లో—రాయల్ ఏస్ (Royal ace) డార్క్ మెజీషియన్ (Dark magician) మారేజ్ ఫార్ ఎ సాంగ్ (Marriage for a song) గ్రేట్ డెకాయిట్(Great Dacoit)—నేను పాడగలనుకూడా' అంది.

'ఓహో! అలాగా!!'

ఆమె తన చెల్లెలితోసహా వచ్చింది.

---

దీనికి తరువాయి వచ్చేసంచికలో మరొక దీర్ఘపుష్టము